# పల్లెలకు సాగని బస్సు ప్రయాణం

- నేటికీ అనేక గ్రామాలకు బస్సుల్లేవ్
- బస్సు ఎక్కాలంటే నడక తప్పదు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కొండాపూర్‌కు బస్సులు లేక నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

**నవాబుపేట:** సమాజం దినదినాభివృద్ధి చెందుతున్నా.. నేటికీ చాలా పల్లెలు బస్సు ప్రయాణానికి కూడా నోచుకోవడం లేదు. తమ పల్లెలకు సైతం బస్సులను నడపాలంటూ ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డు సౌకర్యం ఉన్నా కూడా ఆర్టీసీ బస్సులు రాకపోవడంపై వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మండలంలోని కొండాపూర్, హజిలాపూర్, రేకులచౌడాపూర్, లోకిరేవు, లింగంపల్లి, కిషన్‌గూడ, ఇప్పటూర్, దాయపంతులపల్లి, సిద్దోటం గ్రామాలకు బస్సులు రావు. బస్సు ఎక్కాలంటే మూడు కిలోమీటర్ల నుంచి 5 కిలోమీటర్లు కాలినడకో.. లేక ఇతర వాహనాలపై ఆధారపడుతున్నారు. దీంతో ఎక్కడికైనా వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉన్న నేపథ్యంలో మహాలక్ష్మి పథకాన్ని కూడా వినియోగించుకోలేక పోతున్నామని మహిళలు చెబుతున్నారు.

### రోడ్డు వేసి ఐదేళ్లు గడిచినా



అప్పట్లో బస్సు కావాలని అడిగితే రోడ్డు లేదన్నారు. రోడ్డు వేసి ఐదేళ్లు గడిచినా బస్సు సౌకర్యం కల్పించలేదు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాల్సి ఉంది.

– బోజమ్మ, మాజీ సర్పంచ్, కొండాపూర్

### నాలుగు కిలోమీటర్లు నడవాలి



బస్సు ఎక్కాలంటే నాలుగు కిలో మీటర్ల దూరం నడవాలి. లేదంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాలి. బస్సు ప్రయాణం చేయాలంటే మండల కేంద్రానికి రావాల్సిందే. ప్రతి చిన్న పనికి వేరే గ్రామానికి వెళ్లాల్సి వస్తోంది. ప్రతి రోజు పిల్లలను బైక్‌లపై ఎక్కించుకుని పాఠశాలకు వదిలి వస్తున్నాం.

– పాండునాయక్, స్థానికుడు, హజిలాపూర్‌తండా

### లిఫ్ట్ కోసం ఎదురుచూస్తా..



పాఠశాలకు వెళ్లాలంటే నిత్యం లిఫ్ట్ కోసం ఎదురు చూస్తున్నా. ఎవరో ఒకరు లిఫ్ట్ ఇస్తారు.. లేకుంటే నడక తప్పదు. కామారం నుంచి నిత్యం 20మంది వరకు విద్యార్థులు పాఠశాలకు వెళ్తారు. అందరికీ వాహనాలు దొరకవు. గతంలో రోడ్డు బాగాలేదన్నారు. రోడ్డు వేశాక కలెక్షన్ వస్తుందో.. రాదో అంటూ బస్సులు నడపటం లేదు. విద్యార్థుల బాధలు అర్థం చేసుకోవాలి.

– రఘురాం, ఐదో తరగతి విద్యార్థి, కామారం

# క్రీస్తు మార్గంలో నడవాలి

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో కొవ్వొత్తులను ప్రదర్శిస్తున్న పాస్టర్ వరప్రసాద్ తదితరులు

**స్టేషన్ మహబూబ్‌నగర్:** క్రీస్తు చూపించిన మార్గంలో నడవాలని ఎంబీ చర్చి చైర్మన్, పాస్టర్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రం క్రిస్టియన్‌కాలనీలోగల ఎంబీ ప్రార్థనా మందిరంలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాస్టర్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్ పాల్గొని కేక్‌కట్ చేశారు. అనంతరం ఆయన క్రీస్తు సందేశమిచ్చారు. యేసు క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమని అన్నారు. క్రీస్తు మార్గంలో నడిచినవారికి అన్నిశుభాలే కలుగుతాయన్నారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ విల్సన్, సూపరింటెండెంట్ సువర్ణ డేవిడ్, ఎంబీ చర్చి వైస్ చైర్మన్ బీఐ.జెకబ్, స్టీఫెన్, స్వరూప్, రితు, వెరోనికా పాల్గొన్నారు.

# ముళ్లపొదల్లో మూత్రశాలలు

- విషసర్పాల సంచారం
- భయాందోళనలో విద్యార్థులు



మూత్రశాలల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

**చిన్నచింతకుంట:** ప్రభుత్వ పాఠశాలల్లో నేటికీ సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సీతారాంపేట గ్రామ ప్రాథమిక పాఠశాలలో 60మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. మూత్రశాలల చుట్టూ ముళ్లపొదలు అలుముకున్నాయి. తలుపులు కూడా ఊడిపోయి శిథిలావస్థకు చేరాయి. మూత్రశాలలకు చెత్తాచెదారంలోనే వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. విషసర్పాలు సంచరిస్తుండటంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్యం లోపించింది. పలుమార్లు ఈవిషయాలపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

## క్లుప్తంగా

### ఉపాధ్యాయులకు అవగాహన



**కోయిల్‌కొండ:** స్థానిక ఎమ్మార్సీలో సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాల హెచ్‌ఎంలకు ఫిజియోథెరఫీ వైద్యసేవలపై నిమ్స్(హైదరాబాద్)వారు అవగాహన కల్పించారు. మండలంలోని 55మంది హెచ్‌ఎంలు ఈ శిక్షణలో పాల్గొన్నట్లు ఎంఈఓ వెంకటాజీ తెలిపారు. ఈశిక్షణలో డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ రాజశేఖర్ పాల్గొని అవగాహన కల్పించారు.

### విద్యార్థులకు షూలు పంపిణీ



**నవాబుపేట:** మండలంలోని ఇప్పటూర్, తీగలపల్లి, సిద్దోటం, కారూర్, చెన్నరెడ్డిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం డీసీసీ అధికారప్రతినిధి, జడ్చర్ల ఎమ్మెల్యే సోదరుడు దుశ్యంత్‌రెడ్డి షూలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేదాది నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షూలతో పాటు బ్యాగ్, వాటర్ బాటిళ్లను అందిస్తారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ లింగం, కాంగ్రెస్ నాయకులు తులసీరాంనాయక్, వెంకటేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, ఆశన్న, అంజన్‌కుమార్, వాసుయాదవ్, నీలకంఠ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థికి సన్మానం



**కోయిల్‌కొండ:** స్థానిక శ్వేతావిద్యామందిర్‌లో చదువుతున్న రవితేజ అంతర్ జిల్లా రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ నరేందర్‌జీ తెలిపారు. ఈసందర్భంగా ఆ విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీఈటీ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ



**అడ్డాకుల:** మూసాపేట మండలం దాసర్‌పల్లికి చెందిన పద్మమ్మ మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. పద్మమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహయాదవ్, శివరాములు, భాస్కర్‌గౌడ్, రవివర్ధన్ తదితరులున్నారు.

**మాజీ సర్పంచ్‌కు..**

**దేవరకద్ర:** మండలంలోని అడవి అజిలాపూర్ మాజీ సర్పంచ్ మహబూబ్‌అలీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి గాయపడ్డ అతడిని పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

### సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

**కోయిల్‌కొండ:** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఎదిరింటి నర్సింహులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులతో కలిసి మాట్లాడారు. ఈనెల 17న పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, మండల కోశాధికారి అజ్జుపాష, చంద్రశేఖర్, నరసింహ, వడెన్న, హనుమంతు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు



**జడ్చర్ల టౌన్:** ధనుర్మాసం పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, అర్చనసేవలు జరిపించారు. మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలోనూ ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి అభిషేకం చేసి నూతన వస్త్రాలంకరణ చేశారు.

## ఘనంగా బలభీమాంజనేయ స్వామి రథోత్సవం



**మహమ్మదాబాద్:** మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో బలభీమాంజనేయ స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 4గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌరాణిక నాటకాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆయా గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు రథోత్సవానికి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు సతీష్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ముకుందం, భీమయ్య, చెన్నయ్య, రఘు, యాదయ్య, దేవిజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మార్మోగిన శివనామస్మరణ



**నవాబుపేట:** మండల కేంద్రంలోని పెద్దశివాలయ ప్రాంతం శివనామ స్మరణతో మార్మోగింది. సోమవారం ఆరుద్రోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దశివాలయ ప్రధానపూజారి రామేశ్వరయ్య తెల్లవారుజామున 3 గంటలకు ప్రత్యేక రుద్రాభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

## భక్తులకు అన్నదానం

**దేవరకద్ర:** మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయం వద్ద సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు పి.భాస్కర్, విజయలక్ష్మీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దాదాపు 500మందికి అన్న ప్రసాదాలను అందజేశారు.

# రోడ్డు వేయాలంటూ పాదయాత్ర



రోడ్డు కోసం పాదయాత్ర చేస్తున్న జూలపల్లి గ్రామస్తులు, నాయకులు

**మహమ్మదాబాద్:** మండలంలోని జూలపల్లితో బాటు కోల్‌బాయితండా, జూలపల్లితండా, బుడగజంగంపల్లి గ్రామాల ప్రజలు రోడ్డు వేయాలంటూ పాదయాత్ర చేశారు. సోమవారం జూలపల్లి గ్రామం నుంచి నంచర్లగేట్ వరకు 4కిలోమీటర్ల వరకు ప్రజా పాదయాత్ర చేపట్టి ఆందోళన చేపట్టారు. గతంలో ఈ రోడ్డు నిర్మించాలని ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని వారు కోరారు. పాదయాత్రకు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగలసాగర్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోపాల్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, బాల్‌రెడ్డి, రాజు, మధు, పాండు, హరిచ్చందర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి



**దేవరకద్ర రూరల్:** దేవరకద్రను మున్సిపాలిటీగా ఏర్పాటుచేసే విషయంలో ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాటాల్డారు. ఐదు గ్రామాలతో కలిపి దేవరకద్రను మున్సిపాలిటీగా ప్రకటిస్తే ఆ గ్రామాల్లో 'ఉపాధి' పనులు నిలిచిపోతాయని అన్నారు. మున్సిపాలిటీ ఏర్పాటు విషయంలో ప్రజాభిప్రాయం సేకరించాలన్నారు. ప్రజలకు అభివృద్ధి, ఉపాధి చూపించాక మున్సిపాలిటీ ఏర్పాటుచేయాలని సూచించారు.

# భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహాపడిపూజ



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

**మహబూబ్‌నగర్ న్యూటౌన్:** జిల్లాకేంద్రంలోని గణేష్‌నగర్ సాయిబాబా ఆలయ సమీపంలో సోమవారం అయ్యప్పమాలధారులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి మహాపడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరణ చేసి అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించడంతో పాటు భిక్ష ఏర్పాటు చేశారు. పూజలో గురుస్వాములు సీహెచ్ రవి, నరేందర్, రవి, సతీష్, మాలధారులు రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**నవాబుపేట:** మండలంలోని కొండాపూర్‌లో అయ్యప్ప పడిపూజను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో బాల్‌రాజ్ నివాసంలో నవాబుపేటకి చెందిన వెంకటేష్ గురుస్వామి పడిపూజ చేశారు. అయ్యప్ప మాలధారులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

- టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఖలీల్



తహసీల్దార్ ఘంసీరాంనాయక్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న టీఎఫ్‌టీయు నాయకులు

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** క్రిష్టియన్‌పల్లిలోని 523 సర్వే నెంబర్‌లో ఇంటి స్థలాల పట్టాలు ఉన్న వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఖలీల్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2012లో సర్వే నెంబర్ 523లో ప్రభుత్వం పేదలకు ఇంటిస్థలాల పట్టాలిచ్చి వాటిని స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం 2018లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. 586 మంది లబ్ధిదారుల పట్టాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, వారికి న్యాయం చేయాలని కోరారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అర్బన్ తహసీల్దార్ ఘంసీరాం నాయక్‌కు అందజేశారు. టీఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, చైతన్య మహిళ సంఘం జిల్లా నాయకురాలు శ్రీదేవి, జలాల్‌పాషా, కృష్ణయ్య, బషీర్, లలిత, లక్ష్మీదేవి, మాధవి, గాయత్రి, యాదమ్మ, లక్ష్మి, ఆరిఫాబేగం, నాగరాజు, కవిత, నాగమణి, పావని, జ్యోతి, ఫర్జానా, సత్యమ్మ, శ్రీనునాయక్, పాండయ్య, పరుశురాం, బాలరాజు, సరిత, ఆంజనేయులు, మమత, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

**జడ్చర్ల టౌన్:** చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లను జడ్చర్లలో సోమవారం ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్ మాట్లాడారు. తమ సమస్యలను అసెంబ్లీ కార్యదర్శికి విన్నవించుకునేందుకు వెళ్తున్న సమయంలో అరెస్టులు చేయటం సరికాదని అన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అణిచివేయలేరని, అసెంబ్లీ సమావేశాలు ముగిసే లోపు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, దీపక్‌రాథోడ్, రామకృష్ణారెడ్డి, నర్సింహులు ఉన్నారు.

## నేడు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన

**దేవరకద్ర:** లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టిన వారిని జైళ్లలో నిర్బంధించిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా మంగళవారం నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తామన్నారు.

## కాలుష్యంపై అసెంబ్లీలో చర్చ

- గళమెత్తిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**జడ్చర్ల టౌన్:** మండలంలోని పోలేపల్లి ఫార్మాసెజ్‌లోని ఓ కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్యంపై సోమవారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అసెంబ్లీలో చర్చకు లేవనెత్తారు. ఫిర్యాదు చేసినా కాలుష్యమండలి పట్టించుకోవడం లేదని, చర్యలు తీసుకోవాలని అసెంబ్లీలో గళమెత్తారు. కలుషిత జలాలను రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి చెరువులోకి వదులుతున్నారనే విషయాన్ని ఇదివరకే అసెంబ్లీ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చానని, అయినా ఆ కంపెనీ కలుషిత జలాలను వదలడం ఆపలేదని అన్నారు. ఐటీ పరిశ్రమల శాఖ శ్రీధర్‌బాబు సమాధానమిస్తూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. పరిశ్రమల నుంచి ఎలాంటి వ్యర్థాలు రావటం లేదని, భూసారానికి నష్టం జరగటం లేదని తేల్చినట్లు చెప్పారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ వర్షపునీటితోపాటు వ్యర్థాలను వదులుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. కాలుష్యాన్ని నియంత్రించటానికి రూపొందించిన నిబంధనల్లో 90శాతం అమలుచేస్తే సమస్య పరిష్కారం అవుతుందని సభకు విన్నవించారు. స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు వ్యవసాయ శాఖ నుంచి నివేదికలు తెప్పించుకొని సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు

**దేవరకద్ర రూరల్:** వెంకటాయపల్లి గ్రామ శివారులో ఉన్న వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలంటూ సోమవారం కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకికి సామాజిక కార్యకర్త ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్నారు. ఈవిషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ రవాణాకు అడ్డుపడుతున్నాడని గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులుపై ఇసుక మాఫియా దాడి చేసిందన్నారు. ఫిర్యాదు చేసినవారిలో రైతులు ఆంజనేయులు, రామస్వామి, వెంకటేష్ ఉన్నారు.

## రేపు ధ్యానమందిర వార్షికోత్సవం

**కోయిల్‌కొండ:** చంద్రాస్‌పల్లి గ్రామంలో నెలకొల్పిన శ్రీరామచంద్ర పిరమిడ్ ధ్యాన మందిర 8వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రంగారెడ్డి సోమవారం ఓప్రకటనలో తెలిపారు. ధ్యానం చేయడంతో మానసిక ప్రశాంతతను పొందవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు ధ్యానమందిర వార్షికోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## భౌతిక దాడులను అరికట్టాలి

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** ప్రభుత్వ అధికారులపై భౌతిక దాడులను అరికట్టాలని టీజీఓ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. అబ్దుల్లాపూర్‌మెట్ జాఫర్‌గూడలో ఓ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం ఇరిగేషన్ ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్, లష్కర్, రెవెన్యూ సిబ్బందిపై బౌన్సర్లు దాడి చేయడం సరికాదన్నారు. చెరువుల ఆక్రమణలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఎలాంటి నిర్మాణాలు జరగకుండా ఇంజనీర్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తుంటే వారి విధులకు ఆటంకం కలిగించడం తగదన్నారు.

## కాలువ నిర్మాణ పనులు ప్రారంభం



**జడ్చర్ల టౌన్:** మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డులో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన మురుగు కాలువ నిర్మాణపనులను మున్సిపల్ చైర్‌పర్సన్ కె.పుష్పలత సోమవారం ప్రారంభించారు. పనులను నాణ్యతగా త్వరితగతిన పూర్తిచేయాలని ఆమె సూచించారు. కౌన్సిలర్లు లత, లక్ష్మి, ప్రశాంత్‌రెడ్డి, బుక్క మహేష్, జ్యోతి, సతీష్ ఉన్నారు.

## అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు




**మహబూబ్‌నగర్ రూరల్:** నాయకుల అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య అన్నారు. అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా సోమవారం ముందస్తుగా పోలీసులు మాల మహానాడు నాయకులు కేశవులు, శివకుమార్‌ను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నర్సింహయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని, ఎస్సీ, ఎస్టీ ఉపకులాల వర్గీకరణను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఉద్యమాలు చేస్తుంటే అరెస్టులతో అడ్డుకోవాలని చూడటం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయాలని చూస్తే మాలల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

## చలో అసెంబ్లీ జయప్రదం చేయాలి

**జడ్చర్ల టౌన్:** గ్రామ పంచాయతీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు తెలుగు సత్తయ్య సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

■ లగచర్ల రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించినందుకు నిరసనగా మంగళవారం జడ్చర్లలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించనున్నట్లు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కె.యాదయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా ఉమాదేవి



**చిన్నచింతకుంట:** టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీని సోమవారం ఆసంఘం నాయకులు జడ్చర్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చిన్నచింతకుంట మండలంలోని బండ్రపల్లి గ్రామ జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న ఉమాదేవి జిల్లా ఉపాధ్యక్షురాలిగా, ఉంద్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న శంకరయ్యను ఆడిట్ కమిటీ సభ్యుడిగా ఎంపిక చేశారు. మండలంలోని పలువురు ఉపాధ్యాయులు వీరికి అభినందనలు తెలిపారు.